పోక్సో కేసులో నిందితుడికి 25ఏళ్ల జైలు

ప్రజాశక్తి-విజయనగరం కోట

పోక్సో కేసులో నిందితుడికి 25ఏళ్ల జైలుశిక్ష విధిస్తూ పోక్సోకోర్టు ప్రత్యేక న్యాయమూర్తి కె.నాగమణి సోమవారం తీర్పు చెప్పారు. గంట్యాడ మండలం కొటారుబిల్లి గ్రామానికి చెందిన విసినిగిరి రవి (31) ఆ గ్రామం వద్ద గత ఏడాది అక్టోబరు 27న జరిగిన ఒక శుభ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన అనకాపల్లికి చెందిన మూడున్నరేళ్ల బాలికపై లైంగికదాడికి పాల్పడ్డాడు. ఈఘటనపై విజయనగరం మహిళా పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. నిందితుడిని కొద్ది గంటల్లోనే అరెస్టు చేసి, న్యాయస్థానంలో అభియోగ పత్రం దాఖలు చేసి, ప్రాసిక్యూషను త్వరితగతిన పూర్తయ్యే విధంగా పోలీసులు చర్యలు చేపట్టారు. నేరం రుజువు కావడంతో నిందితుడికి 25ఏళ్ల జైలు శిక్ష, రూ.10వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పినట్లు ఎస్‌పి వెల్లడించారు. ఈ కేసులో నిందితుడికి శిక్షపడే విధంగా దర్యాప్తు చేయడంలోను, సాక్షులను ప్రవేశ పెట్టడంలోను క్రియాశీలకంగా పనిచేసిన పోలీసు అధికారులను, సిబ్బందిని ఎస్‌పి అభినందించారు·

కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

అక్రమ అరెస్టులు, నిర్బంధంపై
అంగన్వాడీల ఆగ్రహం

కలెక్టరేట్ వద్ద ఆందోళన ● కనీస వేతనాలు అమలు, సమ్మె ఒప్పందాల జీవోలు ఇవ్వకుంటే సమ్మెకు సిద్ధం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ విజయవాడలో తలపెట్టిన శాంతియుత ధర్నాకు వెళ్లనీయకుండా అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) నాయకులను, కార్యకర్తలను అత్యంత నియంత్రత్వంగా నిర్బంధించడం, అక్రమ అరెస్టులకు పాల్పడడంతో అంగన్వాడీలంతా ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్బంధాన్ని నిరసిస్తూ, సెక్టార్ మీటింగ్‌ను బహిష్కరించి అంగన్వాడీలంతా సోమవారం పెద్దఎత్తున కలెక్టరేట్ వద్ద ఆందోళన నిర్వహించారు. ప్రభుత్వం నియంతృత్వ చర్యలు మానుకొని వేతనాలు పెంచాలని, గత సమ్మె కాలపు ఒప్పందాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బి.పైడిరాజు, ఎస్.అనసూయ మాట్లాడుతూ విజయవాడలో ధర్నాకు ఎవరూ వెళ్లకుండా సెక్టార్ మీటింగ్‌లు నిర్వహించాలని ఐసిడిఎస్ అధికారులు ఆదేశించడం ద్వారా అంగన్వాడీలపై తీవ్ర ఒత్తిడి తేవాలని ప్రభుత్వం భావించడం అత్యంత దుర్మార్గమని అన్నారు. అయినప్పటికీ ప్రభుత్వ నిర్బంధాన్ని సైతం ఎదుర్కొని వందలాది మంది అంగన్వాడీ కార్యకర్తలు విజయవాడ వెళ్లారని తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రబాబునాయుడు ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు ఇచ్చిన హామీలు అమలు చేయాలని, గత ప్రభుత్వాధికారులతో జరిగిన రాతపూర్వక ఒప్పందాలకు జీవోలు ఇవ్వాలని కోరారు. మహిళా దినోత్సవం రోజున అంగన్వాడీలకు తీపికబురు అని చెప్పి మోసపూరిత గ్రాట్యూటీ జిఒ ఇచ్చారని మండిపడ్డారు. గత ప్రభుత్వంలోనే ఈ జీవో ఇచ్చారని, అందుకు యూనియన్ అంగీకరించకపోవడంతో కార్యకర్తకు 1,40,000, హెల్పర్‌కు రూ.60వేలు గ్రాట్యూటీ చెల్లించే విధంగా అధికారులతో ఒప్పందం కుదిరిందని, ఈ ఒప్పందం ప్రకారం గ్రాట్యుటీ చెల్లింపు జీవో ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీలకు కనీస వేతనం రూ.26వేలు, మట్టి ఖర్చులు రూ.20వేలు అమలు చేయాలని, నూతన విద్యా విధానంలో భాగంగా పిపిఇ 1, పిపిఇ 2 పేరుతో సెంటర్లను బలహీనపరిచే కుట్రలను ఆపాలని, బడ్జెట్లో కేటాయింపులు పెంచాలని, ధరలకు అనుగుణంగా మెనూ ఛార్జీలు, బిల్లులు, అద్దెలు పెంచాలని డిమాండ్ చేశారు. లేదంటే సమ్మెకు కూడా వెనకాడబోమని తెలిపారు. అంగన్వాడీల ఆందోళనకు సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ మద్దతు తెలిపారు. బాబు గ్యారెంటీలకు ఏ ష్యూరిటీ లేదని, హామీలన్నీ గాలి మూటలేనని ఎద్దేవా చేశారు. ఇంటికో పారిశ్రామికవేత్తను తయారు చేయాలని చెబుతున్న కూటమి ప్రభుత్వం ఐసిడిఎస్ లో గర్భిణీలకు, బాలింతలకు, పిల్లలకు సర్వీస్ అందిస్తున్న లక్షలాదిమంది మహిళలకు ఎందుకు కనీస వేతనాలు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. అక్రమ అరెస్టులు, నిర్బంధాన్ని ఖండించారు. సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.శంకర్రావు, కె.సురేష్, నాయకులు బి.సుధారాణి, ఎ.జగన్మోహన్‌రావు, ఉపాధ్యక్షులు టివి రమణ, బి.సూర్యనారాయణ అంగన్వాడీల పోరాటానికి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ప్రభుత్వం ఇదే వైఖరితో ఉంటే భవిష్యత్తులో కార్మిక ,ప్రజా సంఘాలను కలుపుకొని పెద్ద ఎత్తున ఆందోళన సిద్ధం కావలసి వస్తుందని హెచ్చరించారు. అనంతరం కలెక్టరేట్ కూడలిలో మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా అంగన్వాడీ ప్రాజెక్ట్ అధ్యక్ష, కార్యదర్శులు, సెక్టర్ లీడర్లు, మినీ వర్కర్లు, వర్కర్లు హెల్పర్లు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కాలువ కప్పేసి రోడ్డు నిర్మాణం

- ఓ పెత్తందారుడి దురాక్రమణ
- 350 ఎకరాలకు సాగునీరు ప్రశార్థకం
- ఆర్ఐ, విఆర్ఒ పరిశీలించినా పట్టించుకోని వైనం
- చర్యలు తీసుకోవాలంటూ కలెక్టర్‌కు రైతుల ఫిర్యాదు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

సాగునీటి కాలువను కప్పేసి వేసిన రోడ్డు

ఇది రామవరం నుంచి రాకోడు వైపు వచ్చే సాగునీటి కాలువ. ఈ కాలువ ద్వారా వచ్చిన నీటితో రాకోడు గ్రామ పరిధిలోని అనేక చెరువులు, బందలు నిండుతాయి. వీటి ద్వారా సుమారు 350ఎకరాల సాగు భూమికి సాగునీరు అందుతుంది. ఈ ప్రాంతంలో పెద్దగా సాగునీటి వనరులు లేకపోయినా ఈ కాలువ ఉందనే ధైర్యంతో స్థానిక రైతులు వ్యవసాయం చేస్తుంటారు. ఇంతటి జీవనాధారమైన కాలువ గట్టును తవ్వేసి, తవ్వగా వచ్చిన మట్టిని కాలువలో కప్పేసి దర్జాగా రోడ్డువేసేసుకున్నాడు రాకోడుకు చెందిన ఓ పెత్తందారు. దీంతో, తీవ్ర కలతచెందిన రైతులు స్థానిక విఆర్ఒ, ఆర్ఐలకు ఫిర్యాదులు చేసినప్పటికీ ఫలితం లేకపోయింది.

విజయనగరం మండలం రాకోడు గ్రామానికి పెద్దగా సాగునీటి వనరులు లేవు. రామవరం మీదుగా రాకోడు ఎగవ ప్రాంతం నుంచి వచ్చే సాగునీటి కాలువే పంటల సాగుకు అత్యంత కీలకం. ఆ కాలువ వెంబడి నీరు పారిందంటే ఆ గ్రామ పరిధిలోని పాత చెరువు, అన్నంరాజు చెరువు, ఎంకో చెరువు, బారీ బంద, బాపన బంద, రాళ్లబంద నిండినట్టే. వీటి కింద ఉన్న సుమారు 350 ఎకరాల సాగు భూమికి నమ్మకంగా నీరు అందుతుంది. భూమి కూడా సారవంతంగా ఉండడంతో దిగుబడికి కూడా ఢోకా లేదు. ఇటువంటి భూమికి సాగునీరందించే సాగునీటి కాలువ గట్టును రంధి సాధూరావు అనే వ్యక్తి యధేచ్ఛగా ఆక్రమించుకున్నాడు. వాస్తవానికి రాకోడు గ్రామ రెవెన్యూ శివారు ప్రాంతంలో సాధూరావు సుమారు ఏడు ఎకరాల భూమి ఇటీవల కొనుగోలు చేశాడు. అక్కడికి పొలం గట్లపై నుంచే వెళ్లాల్సివుంటుంది. విశాఖనగరంలో ఉంటున్న ఆయన అప్పుడప్పుడు తన వ్యవసాయ క్షేత్రానికి కారుపై వస్తుంటాడు. ఈనేపథ్యంలో నేరుగా కారు తన పొలంలోకి వెళ్లాలంటే కాలువగట్టే మార్గమని భావించాడు. అనుకున్నదే తడువుగా కారు వెళ్లేందుకు వీలుగా సర్వే నెంబర్ 82, 94,95, 27 పరిధిలోవున్న ఆ గట్టును జెసిబితో చదును చేయించి మట్టిరోడ్డు వేయించాడు. కారు వెళ్లేందుకు గట్టు సరిపోయే పరిస్థితి లేకపోవడంతో కాలువను కూడా కప్పేశాడు. దీంతో కాలువ కుశించిపోయింది.

కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న రైతులు

రాజకీయ అండతోనే

కాలువను, గట్టును రాజకీయ అండతోనే సాధూరావు ఆక్రమించాడన్న విమర్శలు గ్రామంలో ఊపందుకున్నాయి. సాధూరావు వైసిపి పార్టీకి చెందిన వారైనప్పటికీ టిడిపి నాయకులు కూడా ఒకరిద్దరు ఆక్రమణ దారుడికి కొమ్ముకాస్తున్నట్లు తెలిసింది. ఇదే అదునుగా కొన్ని రోజుల వ్యవధిలోనే మొత్తం పనికానిచ్చేశాడు. దీంతో, ఆగ్రహించిన పేదలు నాయకుల ద్వారా న్యాయం జరిగే పరిస్థితి లేకపోవడంతో స్థానిక విఆర్ఒ, ఆర్ఐలకు లిఖిత పూర్వకంగానే ఫిర్యాదు చేశారు. ఇద్దరూ క్షేత్ర స్థాయి పరిశీలన చేసినప్పటికీ ఆ క్రమణ దారుడిని హెచ్చరించడం లేదా అతనికి నోటీలు వంటివి కూడా ఇవ్వలేదు. దీంతో గత్యంతరం లేని రైతులు కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కారవేదికకు వచ్చి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ స్పందిస్తూ సమస్యను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీచేశారు.

చర్యలు తీసుకోకపోతే రోడ్డున పడతాం

పాత చెరువు కాలువ, గట్టు ఆక్రమణపై అధికారులు వెంటనే చర్యలు తీసుకోకపోతే గ్రామంలోని రైతులందరం రోడ్డున పడతాం. ఆ కాలువ నీరే మా పంటల సాగుకు ఆధారం. ఇటువంటి కాలువను సాధూరావు అనే వ్యక్తి తన ఏడు ఎకరాల కోసం 350 ఎకరాలకు సాగునీరు అందించే కాలువను ఆక్రమించి రోడ్డు వేసుకోవడం సరికాదు. అధికారులు స్పందించకపోతే ఆందోళన తప్పదు.

బండారు శ్రీను, రైతు, రాకోడు గ్రామం

డిఇఒకు వినతినిస్తున్న యుటిఎఫ్ నాయకులు

సీనియారిటీ జాబితాలో సవరణలు చేయాలి

డిఇఒకు యుటిఎఫ్ నాయకుల వినతి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విద్యాశాఖ వెలువరించిన ఉపాధ్యాయ సీనియారిటీ జాబితాలో సవరణలు చేయాలని యుటిఎఫ్ నాయకులు సోమవారం డిఇఒ యు.మాణిక్యంనాయుడును కోరారు. ఈమేరకు ఆయనకు వినతి అందజేశారు. విద్యాశాఖ ఉపాధ్యాయ బదిలీలకు సంబంధించి విడుదల చేసిన సీనియారిటీ జాబితాలో మార్కులు, రోస్టర్‌లో లోపాలు ఉన్నాయని, విద్యాశాఖ నిబంధనలకు అనుగుణంగా లేదని, వెంటనే వాటిని సవరించాలని కోరారు. వినతి పత్రం అందించిన వారిలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.శ్రీనివాస్, జెఎవిఆర్‌కె ఈశ్వరరావు, రాష్ట్ర నాయకులు కె.విజయగౌరి, రమేష్ చంద్ర పట్నాయక్, కె.భాస్కరరావు, తిరుపతి నాయుడు, సత్యన్నారాయణ, రాం ప్రసాద్ తదితరులు ఉన్నారు.

ఇంటర్ పరీక్షకు 514 మంది గైర్హాజరు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సోమవారం జరిగిన ద్వితీయ ఇంటర్ లెక్కలు 2 బి, హిస్టరీ, జువాలజీ, ఒకేషనల్ 2 పరీక్షకు 514 మంది విద్యార్థులు హాజరు కాలేదు. మొత్తం 18392 మందికి గాను 17878 మంది హాజరయ్యారని అర్ఐఒ ఎం.ఆదినారాయణ తెలిపారు. మాల్ ప్రాక్టీసు కేసులు నమోదు కాలేదని, ప్రశాంతంగా పరీక్ష జరిగిందని తెలిపారు.

భూముల క్రమబద్ధీకరణ జీవోకు ప్రచారం

ప్రజాశక్తి-విజయనగరంకోట

ప్రభుత్వ భూముల క్రమబద్ధీరకణకు అవకాశం కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో 30 జారీ చేసిందని, దీన్ని వినియోగించుకొని భూముల క్రమబద్ధీకరణకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకొనేలా ప్రచారం కల్పించాలని కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ తహశీల్దార్‌లను ఆదేశించారు. జిల్లాలో ప్రస్తుత వేసవి కాలంలో ఎండల తీవ్రత నుంచి ఉపశమనం కలిగించేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ముఖ్యమైన కూడళ్లలో చలివేంద్రాల ఏర్పాటు, నీడనిచ్చే షెల్టర్ల ఏర్పాటు, పశువులకు తాగునీటి సరఫరా, పనిప్రాంతాల్లో షామియానాలు, ప్రాథమిక చికిత్స కేంద్రాలు వంటి ఏర్పాట్లు చేయాలన్నారు. సోమవారం వీడియో కాన్ఫరెన్సు ద్వారా వేసవిలో చేపట్టాల్సిన చర్యలపై తహశీల్దార్లు, ఎంపిడిఒలతో సమీక్షించారు. పిహెచ్‌సిల్లో ఒఆర్ఎస్ ప్యాకెట్లు తగినంతగా అందుబాటులో వుండాలని ఆదేశించారు. జిల్లాలో రెడ్ క్రాస్ సంస్థ ద్వారా చేపడుతున్న కార్యక్రమాల్లో అధికారులు భాగస్వాములు కావాలని కలెక్టర్ చెప్పారు. సమావేశంలో ఇన్ ఛార్జి జెసి ఎస్.శ్రీనివాసమూర్తి, డిప్యూటీ కలెక్టర్‌లు మురళి, ప్రమీలా గాంధీ పాల్గొన్నారు.

చట్ట పరిధిలో సమస్యలు పరిష్కారం : ఎస్‌పి

ప్రజాశక్తి-విజయనగరంకోట

ప్రజల నుంచి వినతులను చట్టపరిధిలో పరిష్కరిస్తామని ఎస్‌పి వకుల్ జిందాల్ తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పిఆర్‌జిఎస్‌లో 37 వినతులు స్వీకరించారు. సంబంధిత పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్సులో మాట్లాడి, సమస్యలను వివరించి, చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఫిర్యాదుదారుల సమస్యల పట్ల సానుకూలంగా స్పందించాలని, ఫిర్యాదుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఫిర్యాదుల్లో భూతగాదాలకు సంబంధించినవి 11, కుటుంబ కలహాలకు సంబంధించినవి 3, మోసాలకు పాల్పడినట్లు 10, ఇతర అంశాలకు సంబంధించినవి 13 ఫిర్యాదులు ఉన్నాయన్నారు. సంబంధిత అధికారులు ఫిర్యాదు అంశాలను పరిశీలించాలని, వాటి పూర్వాపరాలను విచారణ చేసి, ఫిర్యాదు అంశాలు వాస్తవమైతే పరిష్కారానికి వారం రోజుల్లోగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ప్రతి దరఖాస్తునూ పరిష్కరించాల్సిందే

వినతులపై తప్పుగా ఎండార్స్‌మెంట్ ఇస్తే క్రమశిక్షణ చర్యలు : పిజిఆర్ఎస్‌లో కలెక్టర్ అంబేద్కర్

ప్రజాశక్తి-విజయనగరంకోట/టౌన్

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన ప్రతి దరఖాస్తునూ పరిష్కరించాలని అధికారులకు కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వినతుల పరిష్కారంపై జిల్లా కలెక్టర్ సమీక్షిస్తూ వినతులపై తప్పుగా ఎండార్స్‌మెంట్ ఇచ్చి పరిష్కరించినట్లుగా పేర్కొంటే ఆయా అధికారులపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటా మన్నారు. జిల్లాలోని రెవిన్యూ అంశాల పరిష్కారంలో తహశీల్దార్లు సంతృప్తికరంగా పనిచేయాలన్నారు. ఆర్థిక అంశాలతో ముడిపడి వున్నవి, కోర్టు కేసులతో ముడిపడి వున్న సమస్యలు మినహా ఇతర వినతులన్నీ పరిష్కరించాల్సిందేనని కలెక్టర్ చెప్పారు.

అధికారులకు వినతినిస్తున్న వ్యకాస నాయకులు, ఆంధ్ర ఎడమ కాలువ రైతులు

పిజిఆర్ఎస్‌కు పోటెత్తిన వినతులు

ప్రజాసమస్యల పరిష్కార వేదికకు అర్జీదారులు పోటెత్తారు. కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్, ఇన్‌ఛార్జి జెసి ఎస్.శ్రీనివాసమూర్తి, కెఆర్ఆర్‌సి ఎస్‌డిసి మురళి వినతులను స్వీకరించారు. ఈ వారం మొత్తం 231 అర్జీలు వచ్చాయి. వీటిలో రెవెన్యూకు సంబంధించి 173, పంచాయతీ శాఖకు సంబంధించి 15, డిఆర్‌డిఎకి సంబంధించి 11, మున్సిపాల్టీలకు 10, మిగిలినవి ఇతర శాఖలకు సంబంధించి వచ్చాయి. విజయదుర్గా దివ్యాంగుల సంక్షేమ సంఘం, హెల్పింగ్ హేండ్స్ హిజ్రాస్ అసోసియేషన్ ఆధ్వర్యాన ఆదర్శ వివాహం చేసుకున్న రెండు వికలాంగుల జంటలను ఇన్‌ఛార్జి జెసి ఎస్.శ్రీనివాసమూర్తి ఆశీర్వదించారు.

ఆంధ్ర ఎడమ కాలువలో పూడిక తీత చేపట్టాలి

విజయనగరం టౌన్ : ఆంధ్ర ప్రాజెక్టు ఎడమ కాలువ పూడిక తీత,కాలువ మరమ్మత్తు పనులు చేపట్టి చివరి ఆయకట్టు దారులకు సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలని రైతుసంఘం నాయకులు డిఆర్ఒ శ్రీనివాసమూర్తికి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జి.శ్రీనివాస్, రైతులు వినతి అందజేశారు. ప్రాజెక్టు శివారు ఆయకట్టు గ్రామాల భూములకు సాగునీరు చేరేవిధంగా తగు చర్యలు తక్షణమే చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఎడమ కాలువ రైతు నాయకులు కర్రి బంగారు నాయుడు, మంత్రి సూర్యం, బుగత సత్తిబాబు తదితరులు అందజేశారు.

చట్టబద్ధంగా రావాల్సిన పెన్షన్ ను ఇప్పించండి



ఇంగ్లీష్ అధ్యాపకుడిగా, ఎపి ఆర్‌జెసి ప్రిన్సిపల్ గా విధులు నిర్వహించి రిటైర్డు అయిన తనకు చట్టబద్ధంగా రావాల్సిన పెన్షన్ ఇప్పించి నాకు న్యాయం చేయాలని కలెక్టర్‌ను బాధిత అధ్యాపకుడు పుల్లయ్య పూజారి కోరారు. ఎంతోమంది విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దిన తాను గత ఏడాది ఫిబ్రవరి 20న ఉద్యోగ విరమణ చేశానని, నేటివరకు తనకు పెన్షన్ మంజూరు కాలేదని ఆవేదన చెందారు. ప్రస్తుత తాటిపూడి ఎపిఆర్‌జెసి ప్రిన్సిపాల్ డిపివి ఆర్ లక్ష్మి అనేక విధాలుగా అడ్డంకులు సృష్టిస్తున్నారని, ఇప్పటికే విద్యాశాఖామంత్రికి, ఎపిఆర్ఇ సొసైటీ కార్యదర్శికి, ముఖ్యమంత్రికి, గవర్నర్‌కు ఫిర్యాదు చేశానని తెలిపారు. అక్రమాలకు పాల్పడుతున్న ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకొని, తనకు పెన్షన్ ఇప్పించి న్యాయం చేయాలని కోరారు.

వేదాంత ఫిట్‌నెస్ సెంటర్‌ను రద్దు చేయాలి

కలెక్టరేట్ వద్ద ఆటో కార్మికుల ధర్నా

నిరసన తెలుపుతున్న ఆటో కార్మికులు, సిఐటియు నాయకులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

గుర్ల మండలం అచ్చుతాపురం వద్ద వేదాంత మల్టీ నేషనల్ కంపెనీ ఏజెన్సీ ద్వారా ఏర్పాటు చేసిన బ్రేక్ ఫిటెనెస్ సెంటర్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కనకదుర్గ ఆటో వర్కర్స్ యూనియన్ (సిఐటియు), ఆలిండియా రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యాన సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. ఆటో డ్రైవర్లు ర్యాలీ నిర్వహించి, అనంతరం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా ఆటో వర్కర్స్ యూనియన్ కన్వీనర్ కె.సురేష్ మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు ఆటో,క్యాబ్,లారీ, మినీ లారీ, ఇతర రవాణా రంగ వాహనాలకు ఫిట్‌నెస్‌ను ఆర్‌టిఒ అధికారులు నిర్వహించేవారని, దాన్ని రద్దు చేసి అచ్చుతాపురం వద్ద ఏర్పాటు చేసిన వేదాంత మల్టీ నేషనల్ కంపెనీ ఏజెన్సీకి ఆ బాధ్యతను ప్రభుత్వం అప్పగించిందని తెలిపారు. బ్రేక్ చేయాలంటే రూ.3వేలు నుంచి రూ.4వేలు ఖర్చువుతుందన్నారు. దీనికి తోడు రోడ్డు మీద బతికే ఆటో డ్రైవర్లపై జీవో నెంబర్ 21 ఉపయోగించి రాష్ట్ర ప్రభుత్వం పోలీసులు ద్వారా ఫోటోలు తీసి ఈ చలానా పేరు మీద పెద్ద ఎత్తున ఫైన్లు, జరిమానాలు విధిస్తున్నారన్నారు. వీటిని రద్దు చేసి సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి డ్రైవర్స్ పెన్షన్ సౌకర్యం కల్పించి ఆదుకోవాలి, లారీలకు గ్రీన్, టోల్ టాక్స్ రద్దు చేయాలని, 336 సెక్షన్ పేరుతో పోలీసుల అక్రమ కేసులు,వేధింపులు ఆపాలని, రవాణా రంగాన్ని సర్వీస్ రంగంగా గుర్తించి ఓలా, ఉబర్ వంటి ప్రైవేట్ సంస్థలకు అప్పజెప్ప వద్దని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి (డిఆర్ఒ) శ్రీనివాసమూర్తికి వినతి అందజేశారు. ఆయన స్పందించి డిటిసిని పిలిచి ఈ సమస్యలు వెంటనే పరిష్కరించాలని, రాష్ట్ర ప్రభుత్వానికి, కమిషనర్ కు లెటర్ రాయాలని ఆదేశించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎ.జగన్మోహన్, ఎ. గౌరినాయుడు, ఎం.రమణ, సిహెచ్ ముత్యాలు, ఆటో యూనియన్ నాయకులు పాపారావు, రాము నాయుడు, సత్యంకష్ణ, దాలినాయుడు, ఉమామహేశ్వరరావు,రమణ, అప్పారావు, భాస్కరరావు, వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ మెయిన్ పరీక్ష నిర్వహించాలి

కలెక్టర్‌కు డివైఎఫ్ఐ వినతి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కానిస్టేబుల్ అభ్యర్థులకు మెయిన్ ఎగ్జామ్ నిర్వహించాలని, పోలీస్ శాఖలో ఖాళీగా ఉన్న 20 వేల పోస్టులను భర్తీ చేయాలని కోరుతూ కలెక్టర్ బిఆర్ అంబేద్కర్‌కు డివైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ సి హెచ్ హరీష్, నిరుద్యోగులు కలిసి సోమవారం వినతి అందజేశారు. ఈ సందర్భంగా హరీష్ మాట్లాడుతూ వైసిపి ఆధ్వర్యాన 6100 పోలీస్ కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి 2022 నవంబర్ 28న నోటిఫికేషన్ ఇచ్చారని, ప్రిలిమ్స్ పరీక్షకు 4,59,182 మంది హాజరయ్యారని తెలిపారు. అర్హత సాధించిన 95 208 మందికి గత ఏడాది డిసెంబర్ 22 నుండి జనవరి 16 వరకు ఈవెంట్స్ జరిగాయని తెలిపారు. మెయిన్ ఎగ్జామ్ గురించి ఇంతవరకు ప్రభుత్వం నుంచి స్పందన లేదన్నారు. ఆరేళ్లుగా ఎదురు చూస్తున్న నిరుద్యోగులు రీడింగ్ రూమ్‌లకు, కోచింగ్ సెంటర్లకు ఫీజులు కట్టలేక ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. వెంటనే మెయిన్ పరీక్షకు షెడ్యూల్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాగరాజు, శివ, లక్ష్మణ, కానిస్టేబుల్ అభ్యర్థులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులకు పరిహారం పెంచాలి

ప్రజాశకి-విజయనగరం టౌన్

పెందుర్తి నుంచి బొడ్డవర రోడ్డు, ఎస్.కోట బైపాస్ రోడ్డులో భూములు కోల్పోతున్న రైతులకు నష్టపరిహారం లేదా, భూమి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ భూ పోరాట కమిటీ ఆధ్వర్యాన కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు బి.రాంబాబు మాట్లాడుతూ ఎస్.కోట మండలం వెంకట రమణ పేట, కొత్తూరు, ఎస్.కోట, సీతంపేట గ్రామాలకు చెందిన రైతులు సన్న, చిన్న కారురైతులు ఉన్న కొద్దిపాటి భూమిని కోల్పోతున్నారని, ఇప్పటికే ఉత్తరాంధ్ర సుజల స్రవంతి కాలువలో కూడా కొంత భూములు పోతున్నాయని తెలిపారు. జీవనాధారం కోల్పోతున్న రైతులకు పరిహారం పెంచాలని, లేదంటే ప్రత్యామ్నాయ భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు. హై వే పోరాట కమిటీ కో కన్వీనర్ గొంప కృష్ణమూర్తి , రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మద్దిల రమణ, వసంత సత్యారావు, పిల్లల రమణ, పొలమరశెట్టి సూరి బాబు, అశోక్, వి.అచ్చిబాబు తదితరులు పాల్గొన్నారు.

రూ.34 లక్షలకు రోడ్డు మార్జిన్ వేలం పాట

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

2025-26 ఆర్థిక సంవత్సరానికి నగరపాలక సంస్థ పరిధిలో రోడ్డు మార్జిన్ ఆశీలు వసూలు చేసుకునేందుకు నిర్వహించిన బహిరంగ వేలంపాట రూ.34 లక్షలకు ఖరారు అయినట్లు నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య తెలిపారు. సోమవారం సహాయ కమిషనర్ కె.అప్పలరాజు ఛాంబర్లో నిర్వహించిన బహిరంగ వేలంపాటలో ముగ్గురు పాటదారులు పాల్గొన్నారు. ఈ ఆర్థిక సంవత్సరానికి రూ.23.50 లక్షలు సర్కారు వారి పాటగా నిర్ణయించారు. రూ.34లక్షలకు పాడిన గేదెల చంద్రశేఖర్ ఆశీలు వసూలు చేసుకునేందుకు హక్కు కల్పించనున్నట్లు కమిషనర్ తెలిపారు.

సావిత్రీ బాయి పూలేకు నివాళి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్



నివాళులర్పిస్తున్న బిసి సంఘం నాయకులు

భారత దేశంలో మొట్ట మొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రి బాయి పూలే కు ఉత్తరాంధ్ర బిసి సంఘం అధ్యక్షులు నడిపేన శ్రీనివాస రావు, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు నడిపేన శశి భార్గవి ఘన నివాళులర్పించారు. ఆమె వర్ధంతి సందర్భంగా కలెక్టరేట్ వద్ద ఉన్న మహాత్మ జ్యోతి రావు పూలే, సావిత్రి బాయి పూలే విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా జమ్ము శ్రీను మాట్లాడుతూ సావిత్రి బాయి పూలే భావితరాలకు దిశ నిర్దేశం చేశారన్నారు. బిసిల బాగుకోసం ఐక్యత గా పోరాడటం చేపట్టాల్సిన అవసరం ఎంతో ఉందని అన్నారు. శశి భార్గవి మాట్లాడుతూ బిసిల హక్కుల సాధన కోసం, మహిళా రిజర్వేషన్ల కోసం ఢిల్లీలో ఈ నెల 12,13 తేదీల్లో మహిళల రిజర్వేషన్లకు కోసం పోరాటం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో బిసి సంఘం నాయకులు కోరాడ రవి కుమార్, మల్యాడ బ్రహ్మం, ఆల్తి చిట్టిబాబు, రమేష్ బాబు పాల్గొన్నారు.

12న ధర్నా విజయవంతం చేయండి

ప్రజాశక్తి - కొత్తవలస

ఉపాధి హామీ కూలీలు ఈ నెల 12వ తేదీన విజయవాడలో చేపట్టనున్న మహా ధర్నాకు పెద్ద ఎత్తున తరలి రావాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు గాడి అప్పారావు పిలుపునిచ్చారు. సోమవారం దేవాడ గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనుల వద్దకు వెళ్లి ఆయన సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ 100 రోజులు ఉపాధి పని పూర్తి చేసుకున్న గ్రామీణులకు అదనంగా పని దినాలు కల్పించాలని, సమ్మర్ క్యాంప్ అలవెన్సులు, పెండింగ్‌లో ఉన్న వేతనాలు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. వలస కార్మికులకు ఉచితంగా రవాణా సౌకర్యం కల్పించాలని, బియ్యం, గ్యాస్ బండ ఇవ్వాలని కోరారు. ఉపాధి కూలీలంతా మహా ధర్నాకు వచ్చి విజయవంతం చేయాలని కోరారు.

అక్రమ అరెస్టులు దుర్మార్గం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

అంగన్వాడీల అక్రమ అరెస్ట్, గృహ నిర్బంధం దుర్మార్గమని సిఐటియు నాయకులు కిల్లంపల్లి రామారావు అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఛలో అమరావతి కార్యక్రమానికి వెళ్తున్న అంగన్‌వాడీలను అక్రమంగా అరెస్ట్ చేసి, గృహ నిర్బంధం చేయడం దుర్మార్గమన్నారు. కూటమి ప్రభుత్వం మోస పూరిత జీవో ఇవ్వడం దారుణమన్నారు. ఎన్నికల సమయంలో టిడిపి అంగన్వాడీల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు వారిని అక్రమంగా అరెస్టులు చేయడం సమంజసం కాదన్నారు. పోలీసులతో అంగన్వాడీలను అక్రమంగా అరెస్టు చేయడమే కాకుండా సెక్టార్ మీటింగు నిర్వహించడం, గృహ నిర్బంధం వంటి చర్యలకు బయపడరని సమస్యలు పరిష్కారం కోసం మరింత ఆందోళన చేస్తారని హెచ్చరించారు.

వెల్ఫేర్ ఫౌండేషన్ అధ్యక్షులుగా రుక్మిణి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

దిశ ప్రొటెక్షన్ వెల్ఫేర్ ఫౌండేషన్ విజయనగరం జిల్లా అధ్యక్షురాలిగా న్యాయవాది పెంటపాటి రుక్మిణిని నియమించినట్లు జాతీయ చైర్మన్ బి.వెంకటేశ్వర్ రాజు తెలిపారు. సీనియర్ న్యాయవాది అయిన రుక్మిణి ఎన్నో సామాజిక కార్యక్రమాలను నిర్వహించడంతోపాటు బాధిత మహిళలకు సంబంధించిన కేసులలో వారికి సలహా సహకారాలు అందించారని తెలిపారు. జిల్లాలో ఎలాంటి మహిళా సమస్యలు ఉన్న వెంటనే స్పందించి వారికి తగు న్యాయం చేయాలని సూచించారు.

ప్రయివేటు ఫిట్‌నెస్ సెంటర్‌ను రద్దు చేయాలి

ప్రజాశక్తి - గుర్ల

ప్రయివేట్ ఫిట్‌నెస్ సెంటర్‌ను రద్దు చేసి ప్రభుత్వమే నిర్వహించాలని ఎఐఎఫ్‌టియు ఆధ్వర్యంలో సోమవారం అచ్చుతాపురం జంక్షన్ సమీపంలో కొత్తగా నిర్మించిన వేదాంత సొల్యూషన్స్ ప్రయివేటు ఫిట్నెస్ సెంటర్ వద్ద ఆటో కార్మికులు ధర్నా చేపట్టారు. ఎఐఎఫ్‌టియు రాష్ట్ర కార్యదర్శి గణేష్ పాండా మాట్లాడుతూ ప్రభుత్వం ప్రయివేటు ఏజెన్సీలకు అప్పగించడం వల్ల ఆటో డ్రైవర్లపై ఫిట్నెస్ పేరుతో అధిక రుసుములు వసూలు చేస్తారని, అందువల్ల ప్రభుత్వమే ఫిట్నెస్ సెంటర్‌ను నడపాలని డిమాండ్ చేశారు.

మోడల్ స్కూల్లో ప్రవేశాలకు దరఖాస్తులు

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలోని అక్కివరం మోడల్ స్కూల్లో ఆరవ తరగతిలో చేరేందుకు దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపల్ సిహెచ్ సంధ్య సోమవారం ఒక ప్రకటనలో కోరారు. దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 31వ తేదీ వరకూ అవకాశం ఉందన్నారు. వచ్చే నెల 20వ తేదీన మోడల్ స్కూల్లో ఉదయం 10 గంటల నుంచి 12 వరకు పరీక్ష ఉంటుందన్నారు. 2024 - 25 విద్యా సంవత్సరంలో 5వ తరగతి చదువుతూ ఆరవ తరగతిలో ప్రవేశానికి అర్హత పొంది ఉండాలన్నారు. ఒబిసి అభ్యర్థులు 1.9. 2013 నుండి 31.8. 2015 మధ్య జన్మించి ఉండాలన్నారు. ఎస్‌టి, ఎస్‌సి విద్యార్థులు 1.9.2010 నుంచి 31.8.2014 మధ్య జన్మించి ఉండాలన్నారు. ఒసి, బిసిలకు 150 రూపాయలు ఫీజు, ఎస్‌సి, ఎస్‌టిలకు రూ.75 ఫీజు ఆన్‌లైన్‌లో చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

సారా అమ్మితే సంక్షేమం కట్

ప్రజాశక్తి - మెంటాడ

నాటుసారా అమ్మితే ప్రభుత్వం నుంచి అందే అన్ని సంక్షేమ పథకాలను రద్దుచేస్తామని గజపతినగరం ఎక్సైజ్ సిఐ జె. జనార్ధనరావు హెచ్చరించారు. నవోదయం 2.0లో భాగంగా మండలంలోని వానిజ గ్రామంలో సారాపై అవగాహన సదస్సు నిర్వహించారు. సారా వల్ల తలెత్తే ఆరోగ్య సమస్యలు, సామాజిక అనర్థాలను వివరించారు. సారాను ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోందని చెప్పారు. సారా విక్రయించిన వారి సంక్షేమ పథకాలను నిలిపివేయడంతోపాటు రెండోసారి పట్టుబడితే తహశీల్దార్ సమక్షంలో రెండులక్షల రూపాయలు జరిమానా, రెండుకన్నా ఎక్కువసార్లు పట్టుబడే వారిపై పీడీ యాక్ట్ ప్రయోగిస్తామని సిఐ స్పష్టం చేశారు. సర్పంచ్, విఆర్‌ఒ, పంచాయతీ సెక్రటరీ, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్, ఎస్‌హెచ్‌జి మహిళా అధ్యక్షులు, యువ నాయకులు, ఎక్సైజ్ హెచ్‌సితో గ్రామ స్థాయి కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌సి భాషా, లోకాభిరామ్, కానిస్టేబుల్ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

గ్రాట్యుటీ చెల్లింపునకు చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

రిటైర్డ్ జ్యూట్ కార్మికుల గ్రాట్యుటీ చెల్లింపునకు చర్యలు తీసుకోవాలని నెల్లిమర్ల జ్యూట్‌మిల్లు రిటైర్డ్ కార్మికులు డిమాండ్ చేశారు. సోమవారం వారు అసిస్టెంట్ లేబర్ కమిషనర్ ఆదేశాలు మేరకు గ్రాట్యుటీ ఇప్పించాలని కోరుతూ తహశీల్దార్ సుదర్శనరావుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నెల్లిమర్ల జ్యూట్ మిల్లు యాజమాన్యం గ్రాట్యుటీ చెల్లించాలని కోరుతూ 20 మంది కార్మికులు కోర్టులో కేసు వేసి జిల్లా ఎసిఎల్‌ని ఆశ్రయించామన్నారు. ఇందులో 10 మందికి గ్రాట్యుటీ చెల్లించాలని ఆయన ఆదేశించారని చెప్పారు. ఇప్పటికే ఇద్దరు కార్మికులు చనిపోయారని, 2023లో గ్రాట్యూటీ చెల్లింపులు చేయాలని యాజమాన్యానికి ఆదేశాలు జారీ చేసినా ఇంతవరకూ అతీగతి లేదని వాపోయారు. తక్షణమే గ్రాట్యూటీ చెల్లింపులు చేయాలని వారు డిమాండ్ చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో రిటైర్డ్ జ్యూట్ కార్మికులు బి. అప్పలనరసమ్మ, ఎస్. అప్పారావు, పి.అప్పడు, పి.సత్యనారాయణ, జి.గురునాయుడు, ఎల్. రామకృష్ణ ఉన్నారు.

నగర పంచాయతీలో ప్లాస్టిక్ స్వాధీనం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

నగర పంచాయతీలో పరిధిలోని మొయిద జంక్షన్‌లో షాపులపై శానిటరీ ఇన్‌స్పెక్టర్ డి.భాస్కర్, శానిటరీ కార్యదర్శులతో సోమవారం తనిఖీలు నిర్వహించి ప్లాస్టిక్ స్వాధీనం చేసుకున్నారు. ఈ తనిఖీలో ప్లాస్టిక్ వాడిన షాప్ వద్ద 10 కేజిలు ప్లాస్టిక్‌ను స్వాధీనం చేసుకోని, రూ.2000 జరిమానా విధించారు. పాలిథిన్, ప్లాస్టిక్ వస్తువుల వినియోగంతో కలిగే అనర్థాలపై, పట్టణంలో ఎక్కడా పాలిథిన్ కవర్లు, ప్లాస్టిక్ గ్లాసులు, ప్లాస్టిక్ ప్లేట్లును విక్రయించకుండా నిషేధం అమలు చేయాలని, గుడ్డ సంచులను మాత్రమే వాడాలని వ్యాపారస్తులకు అవగాహన కల్పించారు.

సావిత్రీబాయి పూలేకు ఘన నివాళి

ప్రజాశక్తి - వేపాడ

మండల కేంద్రంలోని వల్లంపూడిలో సావిత్రిబాయి పూలే వర్ధంతిని సోమవారం నిర్వహించారు. ముందుగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి అనంతరం ఆమె మహిళలకు చేసిన సేవలను కొనియాడారు. మహిళల్లో మొట్టమొదటి ఉపాధ్యాయులుగా పేద కుటుంబాలకు విద్యను అందించిన ఘనత ఆమెకే దక్కిందని ఆమె ఆశయాలు ప్రతి ఒక్కరూ పాటించి విద్యాభివృద్ధికి కృషి చేయాలని మండల దళిత మహాసభ అధ్యక్షుడు కొమనాపల్లి రాము అన్నారు. ఈ కార్యక్రమంలో గుడివాడ శ్రీను, దేవుడు బాబు, ఎం దేముడు, కే అప్పారావు, గుత్తు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ప్రతి నెలా గర్భిణులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి- రేగిడి

ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమం ప్రతి నెల 9న చేపడుతున్నట్లు వైద్యాధికారులు ఎస్ చలమయ్య, రీనాచౌదరి తెలిపారు. బూరాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం గర్భిణులకు ప్రత్యేక ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. గర్భిణులు వడ దెబ్బకు గురికాకుండా ఉండడానికి తీసుకోవలసిన జాగ్రత్తలు గూర్చి వివరించారు. ప్రతి గర్భిణీ క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేసుకోవాలన్నారు. ప్రమాదకర పరిస్థితి ఉన్న గర్భిణులు ప్రతినెల 9,10వ తేదీన ప్రసూతి వైద్య నిపుణులతో తనిఖీలు చేయించుకోవాలని సూచించారు. హెచ్‌ఐవి, సిఫిలిస్, గర్భస్థ మధుమేహం, టీబీ వంటి పరీక్షలు చేయించుకోవాలని, ప్రతి గర్భిణీ కిల్కారి మొబైల్ అకాడమీ వాయిస్ కాల్స్‌ను గర్భవతి అయిన నాల్గవ నెల నుండి ప్రసవానంతరం బిడ్డకు సంవత్సరకాలం వచ్చేంతవరకు తప్పనిసరిగా సూచనలు పాటించాలని వెల్లడించారు. కుటుంబ నియంత్రణ పద్ధతులు పాటించాలని సూచించారు. అనంతరం 16 మందికి తనిఖీలు చేసి ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇఒ రాధాకృష్ణ, పిహెచ్‌ఎన్ సావిత్రి, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా కేటాయిస్తే ఆందోళన

సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ

ప్రజాశక్తి - భోగాపురం

నిబంధనలకు విరుద్ధంగా చెరుకుపల్లి కొండను ఎవరికైనా కేటాయిస్తే ఆందోళనకు దిగుతామని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ హెచ్చరించారు. మండలంలో వివాదాస్పదమైన 100 కోట్ల విలువైన చెరుకుపల్లి కొండను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ కార్యాలయం వద్ద విలేకరులతో మాట్లాడారు. మాజీ సైనికుల పేరుతో 100 కోట్ల విలువైన చెరుకుపల్లి రెవెన్యూలోని కొండని ఏకంగా నలుగురు మాజీ సైనికులకు నిబంధనలకు విరుద్ధంగా కేటాయించారని అన్నారు. ఇక్కడ 20 ఎకరాల పేరుతో మరో 40 ఎకరాలకు పాగా వేశారని చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా మాజీ సైనికులకు కేటాయించారని అప్పటి కలెక్టర్ సూర్యకుమారి ఈ కొండను ప్రభుత్వ భూమి కింద మార్చి లావాదేవీలు జరగకుండా అడ్డుకున్నారని గుర్తు చేశారు. కానీ ఇటీవలి కొంతమంది వ్యక్తులు వచ్చి ఎటువంటి అనుమతులూ లేకుండా కొండను చదును చేసే పనులు ప్రారంభించడం చాలా దారుణమన్నారు. ఇలాంటి వారిపై కఠిన

కబ్జాకు గురైన కొండ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులను కోరుతున్నామని తెలిపారు. కొండపైకి వేసిన రహదారిని కూడా మూసివేయాలన్నారు. అంతకుముందు ఈ కొండను అన్యాక్రాంతం చేయకుండా కాపాడాలని, ఎవరైనా వ్యక్తులు వచ్చి ఇక్కడ పనులు చేపడితే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తహశీల్దార్ ఎం సురేష్‌కు వినతి పత్రం అందజేశారు.

స్థానికులతో కలిసి కొండ పరిశీలన

స్థానికులతో కలిసి చెరుకుపల్లి రెవెన్యూలోని కొండను సిపిఎం జిల్లా కార్యదర్శి సూర్యనారాయణ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికులతో ఆయన మాట్లాడారు. ఈ కొండను నిబంధనలు విరుద్ధంగా కేటాయింపులు చేసి జిరాయితి భూమిగా గతంలో మార్చేశారని అదే గ్రామానికి చెందిన సరగడ తోగులు రెడ్డి, గంటా నరసింగరావు తెలిపారు. కానీ ఇటీవలి కొంతమంది వ్యక్తులు ఎటువంటి అనుమతులూ లేకుండా ట్రాక్టర్‌తో చదును పనులు చేయడంతో తామే అడ్డుకున్నామని వివరించారు. తమ కొండను ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులకు కేటాయించేందుకు ఒప్పుకోమన్నారు. ఎవరికైనా కేటాయిస్తే సిపిఎం పార్టీ తరపున పూర్తి సహకారం మీకు అందిస్తామని సూర్యనారాయణ వారికి భరోసా ఇచ్చారు. ఆయన వెంట సిపిఎం నాయకులు టీవీ రమణ, బచ్చల సూర్యనారాయణ ఉన్నారు.

నేటి నుంచి జాతర

ప్రజాశక్తి- శృంగవరపుకోట

మండలంలోని వెంకటరమణపేట గ్రామంలో గల శ్రీఅభయాంజనేయ స్వామి, ఎల్లారమ్మ తీర్థ మహోత్సవాలను ఈ నెల 11, 12,13 తేదీలలో నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు సోమవారం తెలిపారు. 11వ తేదీ మంగళవారం ఉదయం 6 గంటల నుండి అభయాంజనేయ స్వామి, ఎల్లారమ్మ గుడిలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. బైటో భజన కార్యక్రమాలు నిర్వహి స్తామని, 12వ తేదీ బుధవారం మధ్యాహ్నం అన్నదానం, ఎడ్ల పరుగు పందేలు, జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తామని చెప్పారు. 13వ తేదీ గురువారం ఉదయం ఎల్లారమ్మకి పసుపు కుంకుమలతో ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. సాయంత్రం గుర్రపు పరుగు పందేలు, రాత్రి డాన్స్ బేబీ డాన్స్ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్ర మాలన్నీ గ్రామ పెద్దలు, ప్రజల సహకారంతో నిర్వహిస్తామని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

తాగునీరు సమృద్ధిగా ఇవ్వాలి

ప్రజాశక్తి- గజపతినగరం

దళిత కాలనీలో మంచినీరు సమృద్ధిగా ఇవ్వాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జి. శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సిపిఎం పార్టీ ప్రజా చైతన్య యాత్రలో భాగంగా మండలంలోని బంగారంపేట గ్రామంలో సిపిఎం నాయకులు సోమవారం పర్యటించి అక్కడ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా దళిత కాలనీలో ఇంటింటి కొళాయిలు నిర్మించాలని, రోడ్లు, కాలువలు నిర్మించాలని, టిడ్కో బిల్లులు చెల్లించాలని, పడిపోతున్న విద్యుత్ స్తంభం స్థానాన కొత్త స్తంభం వేయాలని, పంచాయతీ కార్యాలయం నుండి దళిత కాలనీ వరకు రోడ్డు నిర్మించాలని ప్రజలు కోరారు. అనంతరం సంతకాలతో కూడిన వినతిని అందించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వ విధానాలు ప్రజలను ఇబ్బంది పెట్టే విధంగా ఉన్నాయని సమస్యలను పరిష్కరించే దిశగా లేవని, పోరాటాల ద్వారా హక్కులు సాధించుకుని సమస్యలు పరిష్కారం కోసం ఉద్యమించడమే పరిష్కారమని తెలిపారు. స్థానిక అధికారులకు సమస్యలు వివరించిన తర్వాత పరిష్కారం కానీ ఎడల జిల్లా వ్యాప్త ఉద్యమానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. స్థానిక సమస్యలతో పాటుగా ఉపాధి హామీ పథకం రక్షణకు ఉద్యమించాలని ఆయన ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు టి.కృష్ణ, కె.లక్ష్మణ, కె.ఈశ్వరరావు, రేపక గౌరమ్మ, రాము, సత్యం తదితరులు పాల్గొన్నారు.

కనపాకలో ప్రజా చైతన్య యాత్ర

విజయనగరం టౌన్ : ప్రజాసమస్యలు తెలుసుకునేందుకు సిపిఎం

విజయనగరం : మాట్లాడుతున్న సిపిఎం నాయకులు రమణమ్మ

ఆధ్వర్యాన చేపట్టిన ప్రజా చైతన్య యాత్ర సోమవారం కనపాక రజక వీధిలో సాగింది. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు పి. రమణమ్మకు స్థానిక ప్రజలు తమ సమస్యలను వివరించారు. కరెంటు స్తంభాలు వేసి వీధి లైట్లు ఏర్పాటు చేయాలని, ఇంటి పన్నులు లేని వాటికి పన్నులు వేయాలని కోరారు, ఈ సందర్భంగా రమణమ్మ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని అందుకు సంబంధించిన పోరాట కార్యక్రమాల్లో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. 3వ వార్డు పూల్‌బాగ్ డబుల్ కాలనీలో పేదలకు ప్రభుత్వ స్థలాలను ఇళ్ల స్థలాలు గా ఇవ్వాలని, పట్టాలు ఇవ్వాలని స్థానిక సచివాలయ అధికారులును నగర కార్యదర్శి రెడ్డి శంకరరావు కోరారు.

గిరిశిఖర గ్రామాల్లో ఎమ్మెల్సీ పర్యటన

ప్రజాశక్తి- శృంగవరపుకోట

ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు సోమవారం మండలంలోని దారపర్తి పంచాయతీలో గల పల్లపు దుంగడ గిరిజన గ్రామంలో పర్యటించారు. కొంత కాలంగా ధారపర్తి పంచాయతి పరిధిలో గల పలు గ్రామాల్లో తట్టు వ్యాధి ప్రబలిన నేపథ్యంలో సోమవారం ఆయన ఇంటింటికి తిరిగి అక్కడి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అక్కడ పని చేస్తున్న వైద్య సిబ్బందిని ప్రజలకు అందిస్తున్న ఆరోగ్య సేవలు గూర్చి ఆరా తీసి రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలో ఎప్పుడో కనుమరుగైపోయిన తట్టు వ్యాధి లక్షణాలు మళ్ళీ కనిపించటం కొంత ఆందోళనగా ఉందని, సిబ్బంది సరైన టైమ్‌కు ప్రతి చిన్నారికి 9నెలలకి ఒకసారి మరల 16 నెలలకి ఒకసారి ఎంఆర్ టీకా వెయ్యాలని ఇందులో నిర్లక్ష్యం వహించ వద్దని సూచించారు. కింద స్థాయి నుంచి పై స్థాయి అధికారుల వరకు సమిష్టిగా కృషి చేసి సరైన టైమ్‌కు టీకాలు వెయ్యాలని ఇందుకు జిల్లా, రాష్ట్ర స్థాయి వైద్య ఆరోగ్యశాఖ

గిరిజన మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ

అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. గత కొన్ని రోజులగా ఆసుపత్రిలో ఉన్న రోగులందరూ కోలుకుని డిశ్చార్జ్ అయ్యారని ప్రస్తుతం అంతా బాగానే ఉందని ఎమ్మెల్సీ తెలిపారు అనంతరం అక్కడ ఉన్న గవర్నమెంట్ స్కూల్, అంగన్వాడీని తనిఖీ చేశారు. రోడ్డు సరిగా లేనందున గిరిశకర గ్రామానికి ఎమ్మెల్సీ బైక్ పై వెళ్లారు. ఈ కార్యక్రమంలో ధారపర్తి మాజీ సర్పంచ్ ఎర్రయ్య , ఎంపిటిసి దారగిరి, పెదకండేపల్లి సర్పంచ్ యాళ్ళ రమణ, నాయకులు మురళి రాజు, బోజంకి గోవింద్, వబ్బిన సతీష్, ఛామలపల్లి బుజ్జి, అప్పలరాజు, గనివాడ రవి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కార్యదర్శులపై పనిభారం తగ్గించాలి

ప్రజాశక్తి- డెంకాడ

గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న పంచాయతీ కార్యదర్శులకు అధిక పని భారం, అధిక పని ఒత్తిడిని తగ్గించాలని కోరుతూ పంచాయతీ కార్యదర్శులు సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ వైభవానికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మండల పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకటరావు, చింతపల్లి అప్పలనాయుడు మాట్లాడుతూ తాము 39 సర్వేలతోపాటు ఇతరత్రా ప్రభుత్వ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వీటి ఒత్తిడితో పని భారం ఎక్కువై కార్యదర్శులు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. సచివాలయానికి వెళ్లిన దగ్గర నుంచి వివిధ రకాల సర్వేలతోనే సాయంత్రం వరకు సరిపోతుందని, గ్రామంలో వివిధ పనులపై వచ్చిన ప్రజలకు పని చేయలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పలువురు కార్యదర్శులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: పంచాయతీ కార్యదర్శులకు పనిభారం తగ్గించాలని సోమవారం ఎంపిడిఒకు వినతిపత్రం అందజేశారు. కార్యదర్శులు మాట్లాడుతూ ఇప్పటికే గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ, పన్ను వసూళ్ళ, వ్యర్థాల నుంచి సంపద సృష్టి కేంద్రాల నిర్వహణ వంటి విధులు నిర్వహిస్తూ, వీటితో బాటు పి4సర్వే, సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు. దీనివల్ల మానసిక ఒత్తిడికి గురై అనారోగ్యంతో మరింత ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. కార్యదర్శులు లెంక తౌడు, కె.బంగార్రాజు, శ్రీదేవి, సుందరి, మహంతి వెంకటరావు పాల్గొన్నారు.

పూసపాటిరేగ: పంచాయతీ కార్యదర్శులపై పని ఒత్తిడి తగ్గించాలంటూ ఎంపిడిఒ రాధికకు సోమవారం వినతి పత్రం అందించారు. మండల పంచాయతీ కార్యదర్శులు సంఘం అధ్యక్షులు కె.ఎర్నినాయుడు ఆధ్వర్యంలో ఎంపిడిఒకు పంచాయతీ కార్యదర్శులు ఎదుర్కొంటున్న సమస్యలు తెలియజేశారు. సచివాలయాల ద్వారా నిర్వహిస్తున్న వివిధ సర్వేల పని భారం తగ్గించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రామభద్రపురం: గ్రామ పంచాయతీ కార్యదర్శులు

డెంకాడ: ఎంపిడిఒకు వినతి పత్రాన్నిస్తున్న కార్యదర్శులు

ఎదుర్కొంటున్న వివిధ సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని కోరుతూ మండల పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షులు పువ్వల పార్థసారధి ఆధ్వర్యంలో ఎంపిడిఒ రత్నంకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్థసారధి మాట్లాడుతూ అధిక పనిభారం కారణంగా కార్యదర్శులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శుల సంఘం నాయకులు బొద్దూరు శ్రీనివాసరావు, శ్రావణ్ కుమార్, ఆకుల ప్రవీణ్ కుమార్, బాలకృష్ణ, పొట్టా బంగారు బాబు, శ్రీనివాసరావు, అడపా ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై కలెక్టర్‌కు వినతి

ప్రజాశక్తి - వేపాడ

బక్కునాయుడుపేట వద్ద గల డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ బాలికల సాంఘిక సంక్షేమ వసతి గృహం, కస్తూరిబా బాలికల వసతిగృహం, ఎపి ఆదర్శ పాఠశాల విద్యార్థుల పడుతున్న అవస్థలపై కలెక్టర్‌కు సోమవారం సామాజిక కార్యకర్త రిక్కి అప్పారావు మరోసారి వినతిని అందించారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ మారుమూల గ్రామాలు జాకేరు, కరకవలస, చామలాపల్లి, దబ్బిరాజుపేటకు చెందిన పిల్లలకు బడి బస్సు సౌకర్యం లేక ఇబ్బంది పడుతున్నారని గతంలో చెప్పామని గుర్తు చేశారు. అయితే కలెక్టర్ ఆదేశాలు ప్రకారం ఆర్‌టిసి యాజామాన్యం వచ్చిన పరిశీలించి బస్సు వేయడానికి రహదారాఉల బాగోలేవని తప్పుడు నివేదికను ఇచ్చారన్నారు. గతంలో జిల్లా కలెక్టర్ మారిక రోడ్డు పరిశీలన చేయడానికి ఎంపి, ఎమ్మెల్యే, రాష్ట్ర అధికార ప్రతినిధి గొంప కృష్ణ కూడా వచ్చారని వారెవరికీ లేని ఆటంకం ఆర్‌టిసి యాజమాన్యానికి ఎలా ఉందని ప్రశ్నించారు. ఈ మధ్యకాలంలో ఆ రోడ్డును ఆర్ అండ్ బి అధికారులు బడి బస్సు రాకపోకలకు ఆటంకం లేకుండా బాగు చేయడంతో పాటు జంగిల్స్ తొలగించి విద్యుత్ వైర్లు కూడా మార్చి వేశారని గుర్తు చేశారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి బడి బస్సును ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. కలెక్టర్ స్పందిస్తూ తక్షణమే విద్యార్థుల పదవ తరగతి పబ్లిక్ పరీక్షకు ఆటంకం లేకుండా బస్సు సౌకర్యం కల్పించాలని ఆర్‌టిసి యాజమాన్యానికి ఆదేశాలు జారీ చేసినట్లు అప్పారావు తెలిపారు. కాగా తప్పుడు నివేదిక ఇచ్చిన అధికారిపై చర్యలు తప్పవని హెచ్చరించినట్లు తెలిపారు.

గుర్ల గెడ్డను పూర్తిచేయాలి

ప్రజాశక్తి- మెంటాడ

మండలంలోని గుర్లగెడ్డ మినీ రిజర్వాయర్ పూర్తికి నిధులు విడుదల చేసి పూర్తయ్యేలా చూడాలని పలువురు నాయకులు సోమవారం తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. అనంతరం తహశీల్దార్ కోరాడ శ్రీనివాస రావుకు వినతిపత్రం అందజేశారు. దశాబ్దాలుగా ఈ రిజర్వాయర్ అసంపూర్తిగా నిలిచిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. దీని పూర్తికి నేతల కృషి లోపించడం రైతులకు శాపంగా మారిందని ఆం దోళన వ్యక్తం చేశారు. జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఈ ప్రాంత పర్యటనలో ఈ మిని రిజర్వాయర్ పూర్తికి కట్టుబడి ఉన్నట్టు ప్రకటించి ఆ తర్వాత ఆ ఊసే మర్చిపోయిన విషయాన్ని రైతులు గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం దీనిపై దృష్టి సారించి వీలైనంత త్వరగా పూర్తిచేసి రైతులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. టిడిపి నాయకులు చలుమూరి వెంకటరావు, జిఅన్నవరం, రెడ్డి ఆదినారాయణ, వైసిపి నాయకులు రెడ్డి రాజప్పల నాయుడు, కౌలు రైతుల సంఘం నాయకులు రాకోటి రాములు, లక్ష్మణ రావు, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న అఖిల పక్ష నాయకులు

క్రాష్ ప్రోగ్రామ్ సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మండల వాసులు క్రాస్ ప్రోగ్రాం సద్వినియోగం చేసుకువాలని ఎంపిపి అంబళ్ల సుధారాణి కోరారు. సోమవారం ఆమె స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో క్రాస్ ప్రోగ్రాం వాహనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ వేసవి నీటి ఎద్దడి నివారణకు ఆయా గ్రామాల్లో ప్రభుత్వం క్రాస్ ప్రోగ్రాం ప్రవేశపెట్టిందన్నారు. దీనిలో భాగంగా మరమ్మత్తులకు గురైన చేతి బోర్లను గర్తించి క్రాస్ ప్రోగ్రాం ద్వారా బాగుచేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ కె.రామకృష్ణరాజు, అంబళ్ల శ్రీరాములు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పూసపాటి రేగ: వేసవి కాలంలో తాగునీటి ఎద్దడి నివారణకు క్రాస్ ప్రోగ్రాం ఎంతో ఉపయోగపడుతుందని ఎంపిపి మహంతి కళ్యాణి అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద క్రాస్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో మరమ్మత్తులతో ఉన్న తాగునీటి పథకాలను మరమ్మత్తులు చేయించుకోవాలని ప్రజాపతినిధులకు తెలిపారు. బోర్లు మరమ్మతులకు

నెల్లిమర్ల: జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎంపిపి

సామాగ్రి వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ రాధిక, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారి హేమంత్, స్థానిక సర్పంచ్ టొంపల సీతారాం, నాయకులు మహంతి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రేపు వైసిపి 'యువత పోరు'

ప్రజాశక్తి - బొబ్బిలి

విజయనగరం కలెక్టరేట్ వద్ద ఈనెల 12న జరగనున్న యువత పోరును జయప్రదం చేయాలని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు కోరారు. స్థానిక వైసిపి కార్యాలయంలో సోమవారం యువత పోరు పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వస్తే సూపర్ సిక్స్ అమలు చేస్తామని హామీలు ఇచ్చిన చంద్రబాబు అమలు చేయడం లేదన్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని లేదంటే నిరుద్యోగ భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ, నాయకులు శంబంగి వేణుగోపాలనాయుడు, తూముల భాస్కరరావు, బి.సత్యనారాయణ, మున్సిపల్ వైస్ చైర్మన్ జి.రమాదేవి పాల్గొన్నారు.

కొత్తవలస: స్థానిక వైసిపి క్యాంపు కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, వైసిపి నేతలు యువత పోరు పోస్టర్లను సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. విద్యార్థులు పక్షాన ఈ నెల 12వ తేదీన జిల్లా కేంద్రంలో జరిగే యువత పోరు కార్యక్రమానికీ నియోజకవర్గంలో ఉన్న వైసిపి శ్రేణులు, విద్యార్థులు పాల్గొని వియవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే శోభ హైమావతి, మాజీ డిసిసిబి వేచలపు చినరాము నాయుడు, ఎస్.కోట జెడ్‌పిటిసి మమ్ములూరి వెంకటలక్ష్మి, ఎల్ కోట, వేపాడ ఎంపిపిలు గేదెల శ్రీనివాసరావు, దొగ్గ సత్యవంతుడు, మండల పార్టీ అధ్యక్షులు ఒబ్బిన నాయుడు, మోపాడ కుమార్, మమ్ములూరి జగన్నాథం, మాజీ ఎంపిపి గొరపల్లి శివ, వైస్ ఎంపిపి పినిశెట్టి వెంకటరమణ, అడపా ఈశ్వరరావు, పాల్గొన్నారు.

డెంకాడ : ఈ నెల 12న వైసిపి ఆధ్వర్యంలో తలపెట్టిన 'యువత పోరు' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు కోరారు. మండలంలోని చింతలవలస గ్రామంలో యువత పోరు పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల, నిరుద్యోగులు పక్షాన నిలుస్తూ చంద్రబాబు సర్కారుపై నిరసనగళం వ్యక్తం చేయడానికి మాజీ సిఎం జగన్మోహన్ రెడ్డి యువత పోరు కార్యక్రమానికి పిలుపునిచ్చారని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి పిన్నింటి తమ్మినాయుడు, జిల్లా పార్టీ అంగన్వాడీ విభాగం అధ్యక్షులు పతివాడ కృష్ణవేణి, సర్పంచులు కోటినాయుడు, లెంక లక్ష్మణ్‌రావు, బుడుమూరు రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

చీపురుపల్లి: మోసపూరితమైన మాటలు చెప్పి తీరా గెలిచిన తరువాత విద్యార్థుల జీవితాలతో కూటమి ప్రభుత్వం ఆటలాడుకుంటోందని వైసిపి జిల్లా కార్యదర్శి ఇప్పిలి అనంతం, జిల్లా ప్రచార అధ్యక్షుడు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, మాజీ జెడ్‌పిటిసి మీసాల వరహాలనాయుడు, నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు బెల్లాన వంశీకృష్ణ అన్నారు. తమ నాయకుడు మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పిలుపు మేరకు ఈ నెల 12న యువత పోరు అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని జయప్రదం చేయాలని కోరారు. అనంతరం గోడ పత్రకలను విడుదల చేసారు. ఈ కార్యక్రమంలో పలువురు వైసిపి నాయకులు పాల్గొన్నారు.

గజపతినగరం: ఈ నెల 12వ తేదీన విజయనగరంలో చేపట్టనున్న యువత పోరు కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద ఎత్తున తరలి రావాలని మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పల నరసయ్య పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో యువత పోరుకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి గార తౌడు, వైసిపి నాయకులు, సర్పంచులు బెల్లాన త్రినాథరావు, గిడిజాల కామునాయుడు, ఉప సర్పంచ్ మండల సురేష్, కరణం ఆదినారాయణ, కె.పైడిపినాయుడు, పిఎస్ఎన్ మూర్తి, క్రరీ రామునాయుడు, పాండ్రంకి ప్రకాష్, ఫణీంద్రుడు తదితరులు నాయకులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

గంజాయి కేసులో నిందితుడు అరెస్ట్

ప్రజాశక్తి- శృంగవరపుకోట

గంజాయి కేసులో తప్పించుకు తిరుగుతున్న నిందితుడు కె శ్యామ్‌ను అరెస్టు చేసి కోర్టులో ప్రవేశ పెట్టామని సిఐ వి. నారాయణమూర్తి సోమవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ప్రకారం.. అల్లూరి సీతారామరాజు జిల్లా డుంబ్రిగూడ గ్రామానికి చెందిన కె.శ్యామ్ 2023 మే నెలలో హోండా సిటీ కారులో 60 కేజీల గంజాయితో దొరికిన కేసులో ప్రధాన నిందితుడు. ఇతను సోమవారం విశాఖపట్నం వెళ్తున్నట్టు వచ్చిన సమాచారం మేరకు ఎస్‌కోట ఆర్‌టిసి బస్టాండ్‌లో పట్టుకొని కోర్టులో ప్రవేశపెట్టామని ఆయన తెలిపారు. గంజాయి కేసులో తప్పించుకు తిరుగుతున్న, గంజాయి సప్లై చేసిన నిందితులను తప్పకుండా అరెస్టు చేస్తామని ఆయన హెచ్చరించారు.

రెండు పూరిళ్లు దగ్ధం

ప్రజాశక్తి- మెరక ముడిదాం

మండలంలోని ఉత్తరావిల్లి గ్రామంలో సోమవారం ఉదయం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో రెండు పురిల్లు దగ్ధమైనట్లు తహశీల్దార్ అజు రఫిజన్ తెలిపారు. గ్రామానికి చెందిన గొర్లె శ్రీరాములు సిహెచ్. గౌరమ్మలకు సంబంధించిన ఇల్లులు కాలిపోయాయని, వారి ఇరు కుటుంబాలకు సంబంధించి ఒక్కొక్కరికి పది కేజీల బియ్యం తక్షణ సహాయం అందించినట్లు తహశీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మండల రమణ, మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

IN THE HONURABLE COURT OF THE SENIOR CIVIL JUDGE AT VIZIANAGARAM
I.P.NO. 01/2024

Between :
Siripurapu Suresh, S/o Satyanarayana, R/o Penasam Village, Gantyada Mandal, Vizianagaram Dist. ....Petitioner
And :
1. Kurumella Ganapathi Rao, S/o Appala Naidu, R/o Penasam Village, Gantyada Mandal, Vizianagaram Dist.
2. Saripalli Rambabu, S/o Ramu, R/o-ditto-
3. Dasari Srinu, S/o Appalaswamy, R/o-ditto-
4. Subbisetti Narayana Rao, S/o Venkata Rao, R/o-ditto-
5. Subbisetti Venkata Rao, S/o Appalaraju, R/o-ditto-
6. Karri Appalanaidu, S/o Thoudu, R/o-ditto-
7. Meesala Ganapathi Rao, S/o Somulu, R/o-ditto-
8. Konchada Trinadha Rao, S/o Kasiviswanadham, R/o-ditto-
9. Lenka Sanyasi Rao, S/o Ramakrishna, R/o-ditto-
10. Badithamanu Gowri, S/o Narayana, R/o-ditto-
11. Boda Venkata Krishna, S/o Rama Rao, R/o-ditto-
12. Senapathi Murali, S/o Simhachalam, R/o Tamarapalli Village, Bondapalli Mandal, Vizianagaram Dist.

NOTICE

పై నెంబరు I.P. 01/2024 పిటిషన్ ఇందలి రెస్పాండెంట్స్‌పై ఇన్‌సాల్వెంట్ పర్సన్‌గా డిక్లేర్ చేయమని కోరుతూ వేసిన వాజ్యమునకు ఎన్ని వాయిదాలు వేసినా మీరు కాని, మీ తరుపున కాని ఎవరు హాజరు కాకపోవడం వలన **ఈ నెల 13-03-2025** వాయిదా వేసినారు. కావున మీరు గాని మీ తరుపున ఎవరైనా ఆ రోజు హాజరు అయ్యి మీ వాదనలు, ఆక్షేపణలు తెలియజేయవలెను. లేనిచో మీ పరోక్షముగా కోర్టు తీర్మానం చేయబడునని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

//బై కోర్టు ఆర్డర్//
Smt. P. Rukmini
Advocate for Petitioner,
Vizianagaram.